# 42. దిద్దుకోలేని తప్పు

"ఒక పెద్ద గది, ఒక వంటిల్లు. మనకు చాలదూ?" అన్నాడు గోపాల్, శారదకు ఆ వాటా చూపించి.

శారద మాట్టాడలేదు.

'నీకు నచ్చలేదా? ఈ గోడకు రెండు అలమార్లు. నీ వస్తువులు ఒకదాంట్లోను, నావి ఇంకొకదాంట్లోను సద్దుకోవచ్చు. మనకు పెట్టెలు కొనుక్కోవలిసిన అవసరం ఇప్పుడప్పుడే రాదుకూడా.' ఏదో చెప్పుకుపోయాడు గోపాల్.

శారద ఖాళీగా చూసింది.

"అది కాదండి..."

ఏదో చెప్పాలని ఉంది. చొరవ తీసుకొని చెప్పేటంత చనువు ఏర్పడలేదు. ఏదీ, పెళ్లి అయి రెండు నెలలే అయింది. అందులోనే కొంతకాలం ఎడబాటు. శాశ్వతమైన అనుబంధంకోసం స్వల్పమైన పరిచయం.

"చెప్పు శారదా."

"అదా! పక్కవాటా విషయం నే నప్పుడే కనుక్కున్నాగా! ముసలాయనా, ముసలావిడా ఉంటున్నారు. కూతురికి ఏదో జబ్బుగా ఉన్నదట. సాయం చేయడానికి పోయింది ఆమె. వారం దినాల్లో వస్తుందట. ఆమె వస్తే నీకు మంచి కాలక్షేపం."

శారదకు సందేహం తీరలేదు. అది తీరని సందేహం, మరి అది చెప్పాలంటేనే చిరాగ్గా ఉన్నది.

మేడ మిద కాలేజీ కుర్రవాళ్ళు.

తానూ గోపాల్ ఈ వాటా చూడడానికి మొన్న సాయంకాలమే ఒకసారి వచ్చారు. తాళం వేసిఉండటం వల్ల వీధిలోనించే వెళ్లిపోవలిసివచ్చింది. అప్రయత్నంగా మేడమీదికి తాను చూసింది. అక్కడ ఇద్దరు కుర్రవాళ్ళు... తనవైపు అదోమాదిరిగా చూశారు.

ఈ రోజున తాము ఇంట్లోకి వస్తూండగా వాళ్లు మేడ వరండా వరకు వచ్చి, ఏదో వింత జరుగుతున్నట్టు చూశారు. వంటింటి అవతల కొద్దిగా ఖాళీజాగా. అక్కడ ఒక బావి. బావి లోతు చూడాలి కదా... అక్కడికి వెళ్లి పైకి చూడగా ఆ కుర్రవాళ్లు అటువేపుగా వచ్చిచూడడం కనబడింది...

అట్లా వాళ్లు చూడటం తనకు నచ్చలేదు.

శారద వాళ్లను గూర్చి ఆలోచిస్తూ అలమారు తలుపులు సరిగ్గా మూసుకుంటున్నాయా, అద్దాలకు పాలిషు సరిగా ఉన్నదా అని పరీక్షిస్తున్నట్టు గడిపివేస్తున్నది.

"ఫరవాలేదు. శారదా; ఇల్లు బాగానే ఉంది. అంతగా బాగాలేదని అనిపిస్తే నెమ్మది మీద ఇంకో ఇంటికి మారవచ్చు." అని గోపాల్ వంటింటి లోనికి వెళ్లి తలుపులు బిగించి వచ్చాడు.

కాలేజీ కుర్రవాళ్ళు తనవైపు అలా చూడటం అదెంతో బాధాకరమైన విషయం.

తనకు పెళ్లికాని రోజుల్లో ఎదటింటి వీధి గదిలో ఉండే అబ్బాయి తనను ఏదో ఆప్యాయంగా చూచినట్లే చూచేవాడు. పలకరించేవాడు. పుస్తకాలూ పత్రికలూ ఇచ్చేవాడు. ఎదటింటి మంగమ్మగారు అప్పుడప్పుడు పిలిచి ఏవైనా చిల్లర పనులు చెప్పేది. వాళ్లకు, తన తల్లితండ్రులకు స్నేహం. ఆ అబ్బాయి చూపులు బాగానే ఉండేవి. నీచమైన అర్థం ఎన్నడూ స్ఫురించలేదు. కాని ఒకనాడు...

మంగమ్మగారు లేని సమయంలో ఆ అబ్బాయి వాళ్ల వీధిగుమ్మంలోకి వచ్చి, "మీ మంగమ్మత్తయ్య రమ్మంటున్నది" అన్నట్లుగా సైగచేశాడు. తానది నిజమేననుకొని వెళ్లింది. లోపలికి వెళ్లి తాను అత్తయ్యకొరకు వెతుక్కొంటూఉండగానే అతడు...

తనకు ఎంతో భయం వేసింది.

అతడు తనను ప్రేమిస్తున్నానన్నాడు. పెళ్లి చేసుకుంటానన్నాడు. పారిపోదామని అనుకున్నది తాను. కాని అతడు విడిచిపెట్టడే! చివరికి అతడేమీ చొరవ చేయకముందే తాను బైటపడగలిగింది కాని...

తాను ఇంటిలోనికి వెళ్లేసరికి మేనత్త కొడుకు రవి ఇంటికి వచ్చి ఉన్నాడు. నరకంలో నుండి స్వర్గానికి ఎగిరినట్లయింది.

కాని, తల్లి తనను దబాయించి అడిగింది.

మంగమ్మత్తయ్య ఇంట్లోనుంచి తాను వడివడిగా వస్తూండగా తల్లి చూసింది.

"ఆమె లేదు కదా, ఆ ఇంటికి ఎందుకు వెళ్లావు?"

"అత్తయ్య రమ్మన్నదని అతడు చెప్పాడు."

"ఏమీ చెప్పలేదు."

"సైగ చేశాడు."

"అతడు సైగలు చేయడము, నీవు వెళ్లడము-చాలా బాగా ఉన్నది."

ఎంతోసేపు కాలేదు. అంతా మూడు నిమిషాలు... అంతే. అంతులేని అగాధం తల్లికి, తనకు మధ్య ఏర్పడినది.

బావ తనవైపు జాలిగా చూస్తూ ఉండినాడు, ఆ మూడు రోజులూ.

తల్లి బావను పలుసార్లు అడిగింది. "నీకు ఉద్యోగం కూడా చిక్కింది. శారద ఈ ఇంట్లో ఇంకా ఎంతకాలం ఉండాలి!? త్వరగా ఆ మూడు ముళ్లు వేసి తీసుకుపో, బాబూ!" అని సూటిగా, లౌక్యంగా, పలు రకాలుగా.

అంతకు ముందంతా 'శారద అంటే నా కిష్టమే అత్తయ్యా!... పెళ్ళంటావా, ఉద్యోగం రానివ్వు...' అంటూండే బావ...

"ఆలోచిద్దాం, అత్తయ్యా! నాన్న ఒప్పుకోవాలిగా మరి!" అన్నాడు... 'శారదను మెట్రిక్ పరిక్షకు కట్టించాలి, అత్తయ్యా! కొన్నాళ్లపాటు భార్యలు కూడా ఉద్యోగం చేయడం ఈ దినాల్లో పరిపాటి.'

ఒక రోజున తల్లి రెట్టించి అడగగా, "నాన్న నడిగి ఏ విషయమూ వ్రాస్తాగా!" అన్నాడు.

ఏ విషయంగాని అతడు వ్రాయనేలేదు.

ఒక క్షుద్రమైన, స్వల్పమైన సంగతివల్ల తన జీవితమే మారిపోయింది. రవి భార్య కాగల అవకాశము తాను కోల్పోయింది.

✤ ✤ ✤

గోపాల్ వచ్చి, "పోదామా" అన్నాడు.

"పైన ఎవరండి, కాపరముండేది?"

"పైనా?" గోపాల్ గదిలోనుంచే తల పైకెత్తి చూశాడు. మిద్దె అడ్డం వచ్చింది.

తలదించి, "ఎవరో కాలేజీ కుర్రవాళ్ళున్నట్లుంది." అన్నాడు.

అతని కేమీ అనుమానం తగిలినట్లు లేదు.

స్పష్టంగా, సూటిగా చెప్పేదెట్లా! కాలేజీ కుర్రవాళ్లు ఉండే దగ్గిర అల్లరిగా ఉంటుందండి అని చెప్పితే అతడు ఏమనుకొంటాడో!

ఆ ప్రశ్న గుర్తు పెట్టుకొని అతడు లోతుగా ఆలోచించి విచారిస్తే?... తన సంగతి తెలిసిపోతుం దేమో!

దేవుడా, దేవుడా!...

తన తల్లి బోళామనిషి. గడుసుగా అడిగితే చాలు తన ఊహ అంతా చెప్పేస్తుంది. "దిక్కుమాలిన ముండాకొడుకు. నా కూతురు బ్రతుకు పాడుచేశాడు." అంటుంది. అక్కడ తాను శీలాన్ని పోగొట్టుకోలేదన్న సంగతి ఎవరు నమ్ముతారు? రవిబావ నమ్మలేదు. గోపాల్ నమ్మడు... తన తల్లి నమ్మలేదు. వేరే పురుషులను తప్పు పట్టనేల!... తానుగా "అమ్మా, నువ్వు నన్ను అనుమానిస్తున్నావా! నేనేమీ పాపపు పని చేయ్యలేదు." అని చెప్పింది లేదు. అంతగా తర్జించి ఆమె అడగను లేదు.

"కాలేజీ కుర్రవాళ్లు అయితేనేమి?వాళ్లు పైనే ఉంటారు. స్నానానికి నీళ్లు కూడా పనివాళ్లతో డాబా మీదికి తెప్పించుకొంటారు. ఎప్పుడో కాలేజీకి పొయ్యేటప్పుడు, వచ్చేటప్పుడు తప్ప కిందికి రానేరారు."

ఇళ్లు దొరకడము లేదు.

అందుకని గోపాల్ శారదకు ఏదో నచ్చజెప్పినాడు.

ఆ ఇంట చేరినారు.

✤ ✤ ✤

పదునెనిమిది దినాలైనవి.

శారద సాయంకాలము త్వరగా గృహాన్ని శుభ్రపరచి తాను అలంకరించుకొని గోపాల్ కొరకు ఎదురు చూస్తున్నది. వీధి గుమ్మంవద్ద నిలిచి వేచి చూచి విసుగు పుట్టి గది ద్వారం వద్దనే కూర్చున్నది.

ఈ నిరీక్షణలో తాను పట్టించుకోలేదుగాని మేడ మీది ఆ కుర్రవాళ్లలో చిన్న అబ్బాయి నాలుగైదు సారులు మెట్లు దిగి, ఎక్కి, దిగి, వీధిలోనికి వెళ్లి - తన ముందుగా కదలాడి కనబడినాడు.

మేడమెట్లు వీధి గుమ్మంవద్దనుంచే ప్రారంభము. మేడ ఎక్కేవారు కుడిచేతిపక్కగా చూస్తూ మెట్లు ఎక్కితే తమ గదిలో ఏమి జరిగేది అంతా చూడవచ్చు.

తమ గదిలో చూడకుండా మెట్లు మాత్రమే చూచుకొంటూ ఎవ్వరూ మేడ ఎక్కరు, ఎందుకనో?

మేడ ఎక్కటానికి మెట్లు చూసుకోనక్కర్లేదు. ఒక్కొక్క మెట్టు ఎంత ఎత్తు ఉన్నదో, కాళ్లకు అంచనా తెలిస్తే చాలును.

అతడు మేడ దిగుతూనే ఉన్నాడు. ఎక్కుతూనే ఉన్నాడు. తనవైపు చూస్తూనే ఉన్నాడు.

అతనితో చూపు కలపాలని తనకు లేదు.

అయినా 'ఎందుకు, పనిలేక అట్లా పలుమారులు మేడమెట్లమీదుగా తిరిగేది!' అని కళ్లతో ప్రశ్నించవచ్చు...అని శారద అతనివైపు తీక్షణంగా చూచింది.

అతడు శారద తనవైపు చూస్తేనే చాలని అనుకొన్నట్లుంది: చిరునవ్వు నవ్వినాడు.

"ఇది తప్పు" అనుకొన్నది శారద. "అతడు ఏమో తలపోయవచ్చు" అని లేచి తలుపు వేసుకొని లోనికి పోయింది. గది చీకటిగా ఉన్నది. లైటు వేసుకున్నది.

గోపాల్ వచ్చి తలుపు తట్టినాడు.

"తలుపు వేసుకున్నావేమి? లైటుకూడా వేసినావా!ఇంకా ఆరు కాలేదు, గడియ!"

శారద ముఖంలో వ్యర్థహాసం వెలిగినది. అది ' ఈరోజుకు విడుదల అయింది, ఆ కుర్రవాని చూపుల నుంచి' అన్న నిశ్చింత. స్వల్పకాలము అయితేమాత్రమేమి! వేదన భరించడము ఎవరికి ఇష్టము? విముక్తి కావలెను.

"ఓహో! ఏమి బాగా ఉన్నావు!" అని మూసి ఉన్న తలుపు దగ్గిరగా నొక్కి గోపాల్ శారదను చేరినాడు.

అతని కది మంచి సమయమువలె తోచినది.

✣ ✣ ✣

ఆ కుర్రవాడు... చిన్నవాడు. పదునెన్మిదేళ్లుండవచ్చు. "చిదిమిన పాల్గారు-" ఏదో నాటకములోని పద్యము స్ఫురిస్తుంది... ఆ బుగ్గలలో నిగ్గు తగ్గలేదింకా. మొటిమలైనా పుట్టలేదు. పసితనం స్ఫురిస్తున్నది. అతనికి ఏల, ఈ వ్యాపకము?

తనవైపు విధిగా చూస్తాడు. పొద్దున ఆరుబైట చిమ్మేటప్పుడు... అప్పటికి గోపాల్ నిద్ర లేవడు. అతడు మెట్ల చివరివరకు వచ్చి నేలకు ఒక్క మెట్టు పైగా నిలబడి తనవైపు చూస్తాడు. వాకిలి చిమ్మి, నీళ్లు చిలకరించి, ముగ్గు పెట్టేవరకు అక్కడే ఉంటాడు. పళ్లు తోము కొంటాడు. కాని తనను చూడడం కొరకే వస్తాడు... నిజం!

పెరట్లోనికి వెళ్లి గిన్నెలు, పళ్లేలు, గ్లాసులు కడుగుకొనేటప్పుడు పైకి చూస్తే, కిటికీ వద్ద అతడు నిలబడి ఉంటాడు. అవును. చేతిలో ఏదో పుస్తకం ఉంటుంది. కాని తనను చూడటానికే అతడక్కడ నిలబడేది...నిజం!

స్నానపు గదికి పైన చిన్న కంత ఉన్నది. పైన ఎక్కడ నిలబడి చూచినా తను ఎవరికీ కనబడే అవకాశం లేదు. కాని బావిదగ్గరకు వెళ్లేవాళ్లు గోడదగ్గిర ఆగారంటే ఏమో అనిపిస్తుంది. స్నానం

రెండు మూడు నిమిషాలకు పరిమితం అయిపోయింది అందుకే.

సాయంకాలము అతడు తొందరగా వచ్చివేస్తాడు. తాను గుమ్మంవద్ద భర్తకోసము కాచుకొని ఉంటుంది. కాని అతడు తనకోసమని అనుకుంటున్నాడేమో. ఛీ!

ఆతడు అట్లా చూచినప్పుడల్లా తనకు కోపం వస్తుంది. చిరాకు వేస్తుంది. చేతిలో ఏది ఉంటే దానిని విసిరి కొడుతుంది కూడా.

అతని ఈ అలవాటు మానిపించాలి. లేదా, గోపాల్‌తో చెప్పి ఇల్లు మార్పించాలి, కాలేజీ కుర్రవాళ్లు లేనిచోటికి.

గోపాల్‌తో చెప్పే ధైర్యం లేదు... అతడు గతం తోడితే?

✣ ✣ ✣

నెల దాటింది.

మళ్లీ ఒక సాయంత్రం అతడు ఎప్పటి చూపుతో, అందులో మరింత సంభ్రమం, ఆనందం పోసుకొని వీధిలోనుంచి వచ్చినాడు. అంత ఆనందంతోను శారద వైపు చూచినాడు.

శారద చీదరించుకొన్నది.

'ఈ మగవాళ్లు... వీళ్లా మనుష్యులుగా చెలామణి కావడం ఎంత విచారకరం!' అని చిన్నబుచ్చుకొంది,

అతడు గబగబా మేడపైకి వెళ్లీ మళ్లీ ఇరువది నిమిషాలలో తిరిగి వచ్చినాడు.

అప్పుడే గోపాల్ వచ్చి ఇంటిలో అడుగిడినాడు.

ఆ కుర్రవాడు నిరుత్సాహంతో దిగువ మెట్టుమీద నిలుచున్నాడు.

గోపాల్ పెరటి వసారాలోనికి వెళ్లిన సమయంలో అతని వైపు అసహ్యంగా చూచింది శారద.

అతడింకా అక్కడనే నిలిచిఉన్నాడు. తనవైపు చూస్తూ నవ్వుతున్నాడు.

శారద చీదరించుకొని మొగం బిగించింది.

అతడు నెమ్మదిగా జేబులోనుండి ఒక కాగితం తీసి ఆమె దిక్కుగా విసిరినాడు.

ఆమె ఆ చర్యను అసహ్యించుకొని తలుపు వేసేసి కిటికీ వద్దకు వెళ్లింది. అతడింకా అక్కడే ఉన్నాడు. "ఆ కాగితం నీకే" అన్నట్లు సంజ్ఞ చేసినాడు.

హా! ఎంతకు తెగించినాడు!

కిటికి మూయబోయింది శారద. అతడు కాగితం అక్కడే వదిలి గబగబా మెట్లెక్కి మేడపైకి వెళ్లిపోయినాడు.

మగజాతిపైనే అసహ్యం కలిగింది శారదకు. కన్నెత్తి చూస్తేచాలు, కావాలని కోరినదని అనుకొంటారు కాబోలు!

విసుగుతో, చిరాకుతో కూలబడింది ఆమె.

గోపాల్ వచ్చి ఏమైనా కబుర్లు చెప్పి ఉల్లాసపరిస్తే బాగుండును. గుండె అసహ్యంతో మండుతున్నది.

ఇంతలోనే మెరుపువలె ఆ కాగితం సంగతి గుర్తుకు వచ్చింది. గోపాల్ వస్తాడు. వెలుతురు లేదని తలుపు తెరుస్తాడు. అక్కడ ఎదురుగ ఆ కాగితం ఉంటుంది. దానిని తనకంటె ముందుగా గోపాల్ చూస్తాడు.

'అమ్మా!' -బాధగా అనుకొన్నది శారద. అతడు ఆ కాగితం చూస్తే?...

దానిలో ఏమి ఉండవచ్చు!?

అతడు ఏదో పిచ్చిపిచ్చిగా ఆవేశంతో, కుళ్లుతో వ్రాసి ఉంటాడు. మధ్యలో "నీవు నావైపు చూస్తూఉంటావు. నాకు చాలా సంతోషము, ప్రోత్సాహము అభించినవి..." అని వ్రాశాడేమో!

దానిని గోపాల్ చదివి ఏమి అనుకొనవచ్చు?

ఏమైనా అనుకొనవచ్చు!

శారద త్వరగా లేచి పెరటి దిక్కు చూచింది. గోపాల్‌బావి వద్ద కాళ్లు కడుక్కొంటున్నాడు. ఇక రావచ్చు.

శారద గబగబా వీధి వేపు తలుపు తీసింది.

ఆ కాగితం అక్కడే ఉన్నది.

తొందరగా వెళ్లి ఆమె ఆ కాగితాన్ని చేతిలో తీసుకొని ముక్కలుగా చించివేసింది. రోడ్డు మీద పారవేసేలోగా గోపాల్ బయటికి వచ్చినాడు.

"ఏమది?"

"కాగితము"

"కాగితమా? ఎందుకు చింపివేసినావు?"

దు:ఖం ఉప్పొంగి వచ్చినది శారదకు. కాగితపు ముక్కలు వరండాలో విసిరికొట్టి ఆమె లోనికి వెళ్లినది.

గోపాల్ ఆమె వెనుకనే వెళ్లినాడు.

"నేను మొదటే చెప్పినాను. మేడపైన ఉన్న కుర్రవాడు నా వైపు అదేపనిగా చూస్తాడు. కసిరినా, తిట్టినా తలుపు వేసినా దారి మార్చుకొనలేదు. ఇది మొదటి ఉత్తరము. ఇది చదివితే ఇంకా వ్రాస్తాడని చింపివేసినాను. ఇది నిజము."

కాని ఎట్లా చెప్పేటట్లు?

ఈ సందేశము మానవ ప్రపంచంలోని ఏ భాషలో అయినా నిజమువలె ధ్వనించదు.

ప్రారబ్ధము.

అలంకారములు, భాషాడాంబికము కలిగిన అనృతములు కవిత్వముగా, సాహిత్యముగా మన్ననలంది తరములు తరములు నిలిచిపోవును. నిజము ఏ రోజు కారోజే నశించిపోవును. నిజము పొదిగిన చరిత్రలు విసువుగా నుండును. అబద్ధములు చిరకాలము ఉత్సాహము పుట్టించును.

"ఆ కాగితమేమిటి?"

శారద గోపాల్ గుండెపై ఒరిగినది.

అతడామెను విడదీసినాడు.

"కాగితమేమిటని అడిగితే కౌగిలిలోనికి వస్తావేమి?" శారద నేరము చేసినట్లు మొగము పెట్టి నిస్సహాయంగా ఒక తర్జని పైకి చూపినది.

మెరపువలె గోపాల్ మేడపైకి వెళ్లినాడు.

నాలుగు క్షణములలో ఆ కుర్రవానిని బిరబిర ఈడ్చుకు వచ్చినాడు.

"చెప్పు. ఎందుకు వ్రాసినావు, ఆ కాగితం? అందులో ఏమి వ్రాశావు?"

శారదకూడా వరండాలోకి వచ్చింది.

రోడ్డుమీద పోయేవారు చూచి వెళుతున్నారు.

"చెప్పు!దానిలో ఏమి వ్రాసినావు?" మరలా రెట్టించి అడిగినాడు.

అతడు మాట్లాడలేదు.

"నీ విట్లా చెప్పవుగా!" అని గోపాల్ అతని షర్టుకాలరును ఒక చేతితోపట్టి రెండవచేతితో అతని "చిదిమిన పాల్గారు చెక్కుటద్దములపై" లాగికొట్టినాడు.

శారద అదిరిపడినది.

ఒక్కటే ఒక్కటి.

అంతే!

అతడు స్పృహ తప్పి కింద పడినాడు.

రెండు నిమిషాలు శారదకు, గోపాల్‌కు ఏమీ తోచనేలేదు.

అతడు పడిపోయిన మరుక్షణం శారద లోనికి వెళ్లి కూజాలోని చల్లని నీరు తెద్దామని ఉద్దేశించినది. కాని ఆమె కింకా ధైర్యం రాలేదు.

తాను నిజము చెప్పిఉంటే అతనికి ఈ దెబ్బ తగలక పోయేదేమో!...

తనకు అతడు ఉత్తరము వ్రాయడము, గోపాల్ అతనిని శిక్షించడము, అది తనకే శిక్షవలె తోచడము, తాను అతనికి స్పృహ తెప్పించేకొరకు చన్నీళ్లు తెచ్చి శైత్యోపచారం చెయ్యాలనుకోడము - ఇందులో ఏదో పొరపాటు ఉండి ఉండవచ్చును. అంతా పొరపాటేనేమో! ముఖ్యముగా, అతని శిక్షాసమయములో తాను శైత్యోపచారము కోసము నీళ్లు తెస్తే పొరపాటే కావచ్చును.

స్తబ్ధయైనది ఆమె.

స్థాణువయ్యెను అతడు.

"ఇదేమి, ఇదియేమి! మా నారాయణ కేమైనది?" అంటూ, వీధిలో నుండి; మేడపైన గదిలోనుండే రెండవ అబ్బాయి పరుగున వచ్చి అతనిమీదికి వంగేవరకు అట్లానే నిలుచున్నారు ఆ భార్యాభర్తలు.

అప్పుడు శారద లోనికి వెళ్లడము, చల్లని నీరు తేవడము యాంత్రికముగా జరిగిపోయినవి. గోపాల్ ఆ గ్లాసును తానే అందుకొనినాడు. నారాయణ ముఖం పైన ఆ నీటిని కొద్దిగా చిలకరించి చూచేవరకు అతడు కొద్దిగా కదిలినాడు.

'తమ్ముడూ! లే! ఏం జరిగింది?- పాపము... భయం లేదు, బాబూ...లే, నేను వచ్చినాను!' అని బుజ్జగించిన ఆ స్వరం ఆత్మీయతలో నారాయణ కనులు తెరిపించే అమృతము   న్నది.

అతడు చటుక్కున లేచినాడు.

"వాడిని కొట్టినారా?" అన్నాడు ఆ వచ్చిన అబ్బాయి, నారాయణ బుగ్గను చేతితో తడుముతూ,

"మీవాడు నా చేతిలో కనుక ప్రాణము దక్కించుకొన్నాడు. మరొక చోట అయితే నూరేళ్లు నిండి ఉండేవి. అదిగో, మీవాడు ఈమెకు వ్రాసిన లేఖ!" అని తాను దిగమింగిన క్రోధము అభినయంతో ప్రకటిస్తూ గోపాల్ ఆకాగితపు ముక్కలను చూపినాడు.

నారాయణ ముఖంలో రంగు పోయినది. అతడు అన్నగారిపై బడి తల విలవిల కొట్టుకో సాగినాడు. శారద వైపు చూసే ఏవో అర్థరహిత ధ్వనులు చేసినాడు.

"అతనికి మాటలురావా?"

"అవును స్వామీ, మా నారాయణ మూగవాడు. సాధారణముగా తప్పుచేయడు. ఎట్లాగో ఈ మారు తప్పు చేసి ఉండవచ్చునేమో... అంతా వాని ఖర్మము..."

"మూగవాడా!" శారద దిగ్భ్రాంతి చెందినది.

"మూగవాడు కనకనే నోటితో చెప్పలేక కాగితము వ్రాసినాడు." అనుకొన్నాడు గోపాల్.

నారాయణను చేతులతో పొదివి పట్టుకొని మెట్ల మీదుగా నడిపించుకొని వెళ్లినాడు ఆ అన్న. 'ఏమి వ్రాశావు, తమ్ముడూ, ఆ కాగితంలో?' అని బుజ్జగించి అడుగుతున్నాడు.

గోపాల్ శారదవైపు చూచినాడు. "అవును ఏమి వ్రాశాడు?" అని ఆ చూపు అమె నడిగినది.

ఆమె తల అడ్డముగా ఆడించినది. అందులో నిర్దోషిత్వము బుజువుకానట్లు తోచినది.

ఆ కాగితపు ముక్కలు అక్కడనే ఉన్నవి. గోపాల్ కొంచెము ప్రయత్నిస్తే అవి అతికించి పరిశీలించలేకపోడు.

✤ ✤ ✤

"శారదగారూ!"

మీవారు మిమ్ములను 'శారదా!' అని పిలుస్తూ ఉన్నారు. మీ పేరు అదే అయిఉంటుందని అనుకొన్నాను.

మీరు ముమ్మూర్తులా మా అక్కను పోలి ఉన్నారు. మా అక్క మీవలెనే చాల సౌందర్యవతి; సౌశీల్యవతి. ఆమెకు ఒక ఇంజనీరు భర్త లభించినాడు. ఆమెను ఎంతో ప్రేమతో చూచుకొనేవాడు. తన స్నేహితులందరికి పరిచయం చేసి ఎంతో మురిసిపోయేవాడు.

మూడు సంవత్సరాల క్రితం మా అక్కకు స్ఫోటకము పోసినది. ఆమె మొగము వికృతముగా మారిపోయినది. చూపు దెబ్బతిన్నది. కళ్లకు మందపాటి అద్దాలు ఏర్పడినవి. బావగారు ఆమెను బాగానే చూసుకొనేవారుగాని అక్కను ఏదో సందేహము బాధించేది...ఆమె పండగకు ఇంటికి వచ్చి ఆత్మహత్య చేసుకొన్నది.

మిమ్ములను మొదటి రోజు చూస్తే మా అక్క గుర్తుకు వచ్చినది. మా అక్కకు నా సంగీతమంటే ప్రాణము. నేను బాగా ఫిడేలు వాయించగలను. మీకు నా సంగీతము వినిపించవలెనని, మీలో అక్కను చూడాలని నా కుతూహలము; ఆరాటము.

నా సంగీతము ఎప్పుడు వింటారు?

ఇట్లు,

సోదరుడు,

-నారాయణ."

✣ ✣ ✣

"వేరే ఇల్లు చూచాను, శారదా, సామానులు కట్టి పెట్టు, వెళ్లిపోదాము" అన్నాడు గోపాల్, ఆ మరుచటి దినము ఆఫీసునుండి రాగానే.

శారద నిర్ఘాంతపోయినది.

శుష్కమైన హాసంతో గోపాల్ మొగము వెలిగినది. ఆ కాంతి వెనుక ఏవో అనుమాన మేఘాలు పొడసూపినవేగాని, అది నిజమైన కాంతిగా కన్పట్టలేదు. "ఇంత తప్పు జరిగాక ఈ ఇంట్లో మనము ఉండకూడదు!" అన్నాడతడు.

"తప్పా?..." అన్నది శారద, "నాపైన మీకింకా అనుమానమేనా?" అన్న ప్రశ్న గర్భితంచేసి, 'నారాయణ మూగవాడు. తనను అక్కగా తనను చూచి సంగీతము వినిపింపదలిచాడు. అతనిని గోపాల్ కొట్టినాడు. తనకు అంతులేని జాలి కలిగినది. జాలిలో నుండి ప్రేమ మమకారములు ఉద్భవిస్తాయని గోపాల్ వాదము. కావచ్చును. కాని, నా కతనిపై ప్రేమాభిమానాలు కలిగితే గోపాల్‌కేమయినా నష్టమా?' అని ఆమె నిస్సహాయంగా తనను తాను ప్రశ్నించుకొన్నది.

"అవును, నీవు చేసినది తప్పు కాదా?" అతడు సమర్థించుకొన్నాడు.

☼

*(ఆంధ్రప్రభ' వీక్లీ: 23-10-1968)*